క్లుప్తంగా

మొదటి రోజు రెండు నామినేషన్లు

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గురువారం మొదటి రోజు రెండు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. అందులో భాగంగా చిత్తూరు నగరానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ తెలుగుదేశం పార్టీ తరపున, కార్వేటినగరం మండలానికి చెందిన పద్మనాభం ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, డీటీ తులసిరామ్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ నిర్వాహకులకు అవగాహన


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

నగరి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సిబ్బందికి, ఇండియన్ గ్యాస్ గోడౌన్ సిబ్బందికి అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అవగాహన కల్పించారు. గురువారం పెట్రోల్ బంక్, గోడౌన్ ప్రాంతాలకు వెళ్లిన ఆయన అగ్నిప్రమాదాల నివారణ, మంటలను అదుపుచేసే ప్రక్రియలపైనా డెమో రూపంలో వివరించారు. మంటలు ఎక్కువగా వచ్చినపుడు వాటిని ఎలా ఆర్పాలో ప్రత్యక్షంగా చేసి చూపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చంద్రశేఖర్ రాజు, ప్రవీణ్‌కుమార్, విజయ, మోహన్, ప్రకాష్, రామచంద్రయ్య, కోటేశ్వర రావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: వడమాలపేట మండలం పూడి హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మురగయ్య తల్లి సుబ్బమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి సుబ్బమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యాదవేంద్రరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెయ్యి వితరణ


నెయ్యి డబ్బాలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీస్వామి, అమ్మవార్లకు రోజూ జరిగే నిత్య నైవేద్యం, దీపారాధనకు భక్తులు గురువారం నెయ్యి వితరణగా అందించారు. పుత్తూరుకు చెందిన శ్రీరంగం మిల్క్ ప్రొడక్ట్స్ తరపున రూ.1,81,876 విలువ చేసే 432 కిలోల నెయ్యిని సంస్థ ప్రతినిధులు నిత్యాన్నదానం ఇన్‌చార్జ్ ఏఈఓ ప్రసాద్, సూపరింటెండెంట్ కళ్యాణికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన మారం వెంకటసుబ్బయ్య రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం కుటుంబ సభ్యులతో విచ్చేసిన ఆయన దేవస్థానం అధికారులను కలిసి మనవడు అవ్యుక్తత్ శాస్త్రి పేరున ఈ సొమ్మును అందజేశారు. వారికి అధికారులు కృతజ్ఞతలు తెలిపి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే మన లక్ష్యం


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు

- ఎమ్మెల్యేగా కృపాలక్ష్మి, ఎంపీగా రెడ్డెప్పను భారీ మెజార్టీతో గెలిపిద్దాం
- 3 వేల మంది కార్యకర్తలతో పులిగుండు వద్ద ఆత్మీయ సమావేశం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జ్ఞానేంద్ర రెడ్డి

పెనుమూరు (కార్వేటినగరం): సార్వత్రిక ఎన్నికల్లో గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా కె.కృపాలక్ష్మిని, చిత్తూరు ఎంపీగా రెడ్డెప్పను భారీ మెజారిటీతో గెలిపిద్దామని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు మహాసముద్రం దయాసాగరరెడ్డి ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గం పెనుమూరు మండలం పులిగుండు వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 3 వేల మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో గత ఐదేళ్లలో గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తన గెలుపునకు రెండుసార్లు పెనుమూరు మండలం నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ ఎన్నికల్లో తన కుమార్తె కృపాలక్ష్మి గెలుపునకు కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా మహాసముద్రం కుటుంబానికి తనతో పాటు తమ కుటుంబం కూడా రుణపడి ఉంటుందన్నారు.

ఆశీర్వదించండి.. ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ తన తండ్రిలా తనను గంగాధర నెల్లూరు నియోజక వర్గ ప్రజలు ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఎంపిక చేశారన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుని, గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మహాసముద్రం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా కృపాలక్ష్మిని, ఎంపీగా రెడ్డెప్పను భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితోనే ఇది సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.హేమలత రెడ్డి, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు సురేష్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, మండల యువత అధ్యక్షుడు లోకేష్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఆమీన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కృష్ణారెడ్డి, జిల్లా యువత కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, పులికల్లు బాలాజి రెడ్డి, దూది వెంకటేష్, దేవరాజులు రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, గంధం ముని, మునేంద్ర మండల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ గెలుపే లక్ష్యంగా పని చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న అన్బళగన్, శేఖర్ యాదవ్

పాలసముద్రం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు గెలుపే లక్ష్యంగా పని చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి సీఎంను చేసుకుందామని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. గురువారం వారు పాలసముద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అన్నిటినీ అమలు చేశారని తెలిపారు. ప్రస్తుతం అమలు అవుతున్న సంక్షేమ పథకాలు అలాగే కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. చంద్రబాబు మోసకారి వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు వివరించాలని సూచించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కృపాలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

నేడు నామినేషన్..

జీడీ నెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి నేడు నామినేషన్ వేయనున్నారని, ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్, వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పోలయ్య, సుందరరాజు, ధనుంజయన్, రవిరెడ్డి, కుట్టి, ప్రకాష్, చిన్నపయ్యన్, బాబు, చంద్రశేఖర్‌రాజు, వేణు, సుమన్, నరసింహన్, మనోహర్, గోపాల్, లోకిదాస్, నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్వేటినగరానికి చెందిన పీ.శ్రీజ, చిరంజీవి దంపతుల కుమార్తె పీ.ఐశ్వర్య జన్మదినం సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నదానం చేపట్టారు. గురువారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ దాతలు ప్రతి వారం ముందుకొచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్ర, శనివారాల్లోనే కాకుండా వారి కోరిక మేరకు రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు. దాత కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

కృపాలక్ష్మిని మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించండి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా కృపాలక్ష్మిని ఆశీర్వదించాలని, శుక్రవారం ఆమె నామినేషన్ వేయనున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. గురువారం ఆయన నామినేషన్‌కు సంబంధించిన ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంగాధర నెల్లూరు మండలంలోని సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం గంగాధర నెల్లూరు మండల కేంద్రానికి కార్యకర్తలు, నాయకులు అభిమానులతో కలిసి చేరుకుంటామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఆయన వెంట నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, శ్రీరంగరాజపురం జెడ్పీటీసీ రమణ ప్రసాద్ రెడ్డి, పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, నాయకులు గురవారెడ్డి, పద్మనాభ రెడ్డి, జనార్దన్, గణపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీని గెలిపించండి


నంబాలపల్లెలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెదురుకుప్పం: సీఎం జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని గెలిపించాలని జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ బోడిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. గురువారం మండలంలోని జక్కిదొన పంచాయతీ నంబాలపల్లె గ్రామంలో మహిళలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి జక్కిదొన గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లుగా మారుమూల గ్రామాలైన జక్కిదొన, గంటావారిపల్లె పంచాయతీల్లో అభివృద్ధి కనుచూపు మేర ఎక్కడా జరగలేదని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది నాయకులు వచ్చినా, ఇక్కడ సమస్యలను పరిష్కరించలేదన్నారు. మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఎంత అవస్థలు పడ్డారో గుర్తు చేసుకోవాలన్నారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో జరిగిన అభివృద్ధి పనులు మన కళ్లముందే కనిపిస్తున్నాయని తెలిపారు. సిమెంటు రోడ్లు, తారురోడ్ల నిర్మాణాలు, కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో పాటు గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా ఉన్న పక్కా భవనాలు, ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. టీడీపీ హయాంలో దోపిడీలు తప్ప ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదని, ఏ గ్రామంలోనూ ఒక్కటంటే ఒక్క పని కూడా చేయలేదని చెప్పారు. మళ్లీ కొతమంది బురిడీ బాబాలు అవతారమెత్తి ఓట్ల కోసం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను మోసం చేసేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వాటిని నమ్మవద్దన్నారు. హత్య కేసుల్లో ముద్దాయిలు, అక్రమార్కులు, భూకబ్జాదారులను పార్టీలో చేర్చుకుని టీడీపీ అభ్యర్థి థామస్ హింసావాదాన్ని ప్రోత్సహిస్తూ మభ్యపెడుతున్నాడని చెప్పారు. గ్రామాలు బాగుపడాలంటే, పేద ప్రజల జీవితాల్లో వెలుగులు రావాలంటే మళ్లీ జగనన్నను సీఎం చేసుకుని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా కృపాలక్ష్మిని గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, సర్పంచ్ కావేరి, స్థానిక నాయకులు పెద్దిబ్బరెడ్డి, మునికృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నీలకంఠరెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలి

తిరుపతి సిటీ: మానసిక బుద్ధి మాంద్యంతో బాధపడే పిల్లల లక్షణాలను కనుగొని చికిత్సపై వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని మహిళా వర్సిటీ వీసీ డి.భారతి విద్యార్థినులకు సూచించారు. గురువారం స్థానిక మహిళా వర్సిటీలో మానసిక బుద్ధిమాంద్యం పాఠశాల టీచర్లకు, ఎంఎస్ డబ్ల్యూ, స్పెషల్ బీఎడ్ విద్యార్థినులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం వర్సిటీ అధ్యాపకులు, అక్షయ క్షేత్రం బుద్ధిమాంద్యం పాఠశాల టీచర్లు వీసీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నందిని, అక్షయ క్షేత్రం డైరెక్టర్ అన్నపూర్ణ, డీన్ వాణి, ఐవీ లలితకుమారి, తులసి, మల్లేశ్వరమ్మ, వజహాబాను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ ఉన్నచోట ర్యాగింగ్ ఉండదు

- ప్రిన్సిపల్ వేణుగోపాల్


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి: క్రమశిక్షణ ఉంటే ర్యాగింగ్ సమస్య ఉండదని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. గురువారం కళాశాలలో యాంటీర్యాగింగ్ విభాగం సమన్వయకర్త డాక్టర్ సి.చిన్నపాపమ్మ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణలో ఈ కళాశాల ప్రథమ స్థానంలో ఉంటుందని, ర్యాగింగ్‌కి సంబంధించిన ఇబ్బందులు కళాశాలలో లేకపోవడం ప్రశంసనీయమన్నారు. ప్రతి ఏడాది కళాశాలకు నూతనంగా ప్రవేశించే విద్యార్థిని విద్యార్థులకు ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. స్థానిక పోలీసు విభాగానికి సంబంధించిన బి.లక్ష్మి ర్యాగింగ్ వ్యతిరేకతపై సుదీర్ఘమైన ఉపన్యాసం చేశారు. అందులో భాగంగా మనిషి ప్రాథమిక హక్కుల గురించి వివరిస్తూ విద్యార్థినీ విద్యార్థులు కళాశాలలో విశ్వవిద్యాలయాల్లో ఎలా మెలగాలో తెలియజేశారు. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసుకోకుండా ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియజెప్పారు. దిశా యాప్‌కు సంబంధించిన అనేక అంశాలను విద్యార్థులకు వివరించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ రాజు, ఐక్యూ కోఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ పి.వరలక్ష్మి, ఇ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు


నగరి: పార్టీలో చేరిన వారితో మంత్రి ఆర్కే రోజా


మంత్రి రోజా సమక్షంలో పార్టీలో చేరిన వడమాలపేట నేతలు

నగరి: నగరి రూరల్ మండలం బీరకుప్పం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, ఎంపీటీసీ చంద్రారెడ్డి, సర్పంచ్ మునస్వామి, వైస్ సర్పంచ్ దేవరాజులు, శేఖర్, ఏలుమలై రెడ్డి, శశికుమార్, నాగభూషణం, పయని ఆధ్వర్యంలో మంత్రి ఆర్కేరోజా నివాస కార్యాలయం వద్దకు విచ్చేశారు. అందులో టీడీపీ నేతలు మునెమ్మ, చెంచమ్మ, సుబ్బలక్ష్మి, విజయమ్మ, పార్వతి, మునిలక్ష్మి, నాగరత్నం, బుజ్జి, ఆదిలక్ష్మి, దేశమ్మ, అమ్ములు, మునిస్వామి, చిరంజీవి, సుబ్బరత్నం, చెంగల్ రాయుడు, బాలకృష్ణ, ఏసురత్నం, రామచంద్ర, ఆనందయ్య, శ్రీనివాసులు, సదాశివం, నాగముని, నాగరెడ్డి, ప్రవీణ్, ఈశ్వర్, రాజేంద్రన్, మునికృష్ణ, నందయ్య, శేఖర్, నటరాజ్, గంగాధరం, వెంకటముని తదితరులు వైస్సార్‌సీపీపీలో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

పుత్తూరులో...

పుత్తూరు: వడమాలపేటకు చెందిన పలువురు టీడీపీ నాయకులు గురువారం రాత్రి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వడమాలపేట మండల సోషల్ మీడియా కన్వీనర్, యూత్ నాయకుడు కళత్తూరు జగదీష్ ఆధ్వర్యంలో వడమాలపేట పంచాయతీ 6వ వార్డు మెంబర్ సోమశేఖర్ అతని అనుచరులు జగదీష్, నాగరాజ్, మధు, మూర్తి, వెంకటేష్, అయిలు, సుబ్రమణ్యం, శంకరయ్య, రాజగోపాల్, సాయిరాజ్, రఫీ, రాఘవయ్య, ఉపేంద్ర, అభి, దేవకమ్మ, మల్లికమ్మ, గోవిందమ్మ, మంజుల, కళావతి, దీనమ్మ, సంధ్య, దేవి, లక్ష్మి, ఇందిరమ్మ తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి రోజా పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన సోమశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంత్రి రోజమ్మ పేదలను ఆదుకుంటున్న వైనం, కరోనా సమయంలో ఆమె తెగువ గొప్ప విషయమన్నారు. జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజాతో కలిసి నడుస్తామని, ఎన్నికల్లో ఆమె గెలుపునకు తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం


నిండ్ర: గొల్లకండ్రిగలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి

నిండ్ర: ఐదేళ్ల జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందని, వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని నగరి నియోజకవర్గం పార్టీ పరిశీలకులు, రాష్ట్ర ఉపాధిహామీ పథకం కౌన్సిల్ సభ్యులు మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గొల్లకండ్రిగ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, తిరిగి అభివృద్ధి పూర్తిస్థాయిలో అమలు జరగాలంటే జగనన్నతోనే సాధ్యమన్నారు. ఇంటింటి ప్రచారంలో నాయకులతో కలిసి ప్రచారం చేశారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని, అలాంటి వారికి ఓటు వేయవద్దని తెలిపారు. జగనన్న ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చి అందరి ఇంటా వెలుగులు నింపారని చెప్పారు. నగరి నియోజకవర్గంలో రోజమ్మ ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారని ఈ ఎన్నికల్లో మరోసారి ఆమెను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, మండల కన్వీనర్ వేణురాజు, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, కోఆప్షన్ సభ్యులు అనిల్, ఎంపీటీసీ సభ్యులు విజేష్, సర్పంచ్ రవి, రాజేష్, లక్ష్మీపతి, మీరాలుయాదవ్, శివారెడ్డి, ఆనందయ్య, అమర్‌నాథ్, రాజేష్, మహేష్, రామచంద్రరెడ్డి, సుబ్రమణ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా


రాజీనామా పత్రాన్ని చూపుతున్న వలంటీర్లు



పుత్తూరు: ఎంపీడీఓ ప్రసాద్‌కు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు, నిండ్రలో..

పుత్తూరు: తెలుగుదేశం పార్టీ నాయకుల వేధింపులను తట్టుకోలేక పుత్తూరు మండలం వేపగుంట సచివాలయ పరిధిలోని ఏడుగురు వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మీడియాతో మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నామని తెలిపారు. వలంటీర్ వ్యవస్థతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్న నేపథ్యంలో ఎన్నికల పేరిట తెలుగుదేశం పార్టీ నాయకుల తమను వివిధ రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన తాము రాజీనామాలు చేయడం జరిగిందని వెల్లడించారు. రాజీనామా చేసిన వారిలో ప్రీతి, ధనంజయులు, ఆనంది, ఏ.కౌశల్య, వైశాలి, సాయిచంద్ ఎంఎస్ కౌశల్య ఉన్నారు. ఇకపై తాము స్వేచ్ఛగా ప్రజలకు సేవ చేస్తూ, జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా మంత్రి రోజమ్మ గెలుపు కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.

నగరిలో 36 మంది..

నగరి: మండలంలోని ముడిపల్లి, నంబాకం, తెరణి, దామరపాకం సచివాలయాలకు చెందిన వలంటీర్లు 36 మంది గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రవి కుమార్ రెడ్డికి అందజేశారు. రాజీనామా చేసిన వారిలో ముడిపల్లికి చెందిన 16 మంది వలంటీర్లు, నంబాకంకు చెందిన 8 మంది, తెరణికి చెందిన ఐదుగురు, దామరపాకంకు చెందిన ఇద్దరు ఉన్నారు. వీరు మాట్లాడుతూ టీడీపీ నేతల అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెందానన్నారు. మనస్ఫూర్తిగా సేవ చేస్తుంటే అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి అండగా నిలుస్తానన్నారు.

నిండ్రలో..

నిండ్ర: మండలంలోని ఆరూరు సచివాలయ పరిధిలో పని చేస్తున్న 10 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీఓ భవానీకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు తాము నిత్యం సేవలు అందిస్తున్నామని, కానీ టీడీపీ నేతలు తమపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తట్టుకోలేక రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.